తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
08-04-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 70
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఏఎస్ అధికారులు

బలాన్ని కాకుండా మేధస్సుతో చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగాన నిలవండి
కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అట్టడుగు వారికి చేరేలా సమాచార వ్యాప్తి చేయండి
ఐఏఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన
2009, 2023, 2024 ఐఏఎస్ ట్రైనీ అధికారులతో కేంద్ర మంత్రి భేటీ

3





### యూరియాను శాస్త్రీయంగా వాడాలి

'రైతు నేస్తం'లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

3



### ప్రజారోగ్యమే సమాజానికి బలమైన పునాది

'వరల్డ్ హెల్త్ డే' లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

3



### లష్కరే తొయిబా ముఠా అరెస్టు

- 16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాదిని పట్టుకున్న పోలీసులు

2



# వేల కోట్లు దోచేశారు..!

ఒక్క ఏడాదిలోనే సైబర్ నేరగాళ్ల వల

దేశవ్యాప్తంగా రూ.35 వేల కోట్ల మళ్లింపుపై ఈడీ ఆరా

252 ప్రధాన కేసుల్లో రూ.35,925 కోట్ల దారి మళ్లింపు గుర్తింపు

అనుమానిత ఖాతాదారులకు నోటీసులిచ్చే అవకాశం
నేరగాళ్లు కూడబెట్టిన ఆస్తుల జప్తుకు ఈడీ సిద్ధం
బాధితులకు డబ్బులు తిరిగి అందించడమే ప్రధాన లక్ష్యం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 :**
దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాల వెనుక ఉన్న అంతిమ లబ్ధిదారులను గుర్తించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. అమాయకుల బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా దారి మళ్లించిన నిధులు, వాటితో నేరగాళ్లు కూడబెట్టుకున్న ఆస్తులను జప్తు చేసే దిశగా చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో అనుమానాస్పద లావాదేవీలు జరిగిన ఖాతాదారులకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టే అవకాశం ఉంది.

**వేల కోట్ల మోసాలు**
పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సైబర్ నేరగాళ్లు విస్తృతంగా మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకులతో పాటు ఉన్నత విద్యావంతులు, అధికారులు కూడా ఈ మోసాలకు బలవుతున్నారు. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి రూ.16 కోట్లు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2025లో దేశవ్యాప్తంగా రూ.22,495 కోట్లు, 2024లో రూ.22,845 కోట్ల మేర సైబర్ మోసాలు జరిగినట్లు అంచనా.క్షణ లేదు అని చెప్పడానికి కాగ్ రిపోర్టు నిదర్శనం. బడ్జెట్లలో చెప్పేది ఒకటి, ఆచరణలో

..మిగతా 2లో

## కేరళంలో పంచాయతీరాజ్ విజయం

కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైంది

విజయన్ మా సవాల్‌ను స్వీకరించి తెలంగాణ రావాలి
కోవలం ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్



**త్రివేండ్రం, ఏప్రిల్ 7:**
కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించిందని, దానిని తాము అభినందిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలదని, ఎక్కడైనా మంచి జరిగితే అభినందిస్తామని చెప్పారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవలంలో యూడీఎఫ్ తరపున ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత సీఎం పినరయి విజయన్ హయాంలోని వైఫల్యాలను ఎత్తి చూపానంటూ ఆయన హయాం ముగిసిందని, 120 నెలల విజయన్ పాలనా కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని విమర్శించారు

..మిగతా 2లో

## మావోయిస్టు విముక్త తెలంగాణ

### డీజీపీ శివధర్ రెడ్డి

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పర్యటన,
పాములూరులో పోలీస్ ఔట్‌పోస్ట్‌కు శంకుస్థాపన

2



## రెండు వారాల్లో పరిష్కరిస్తాం

- పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణపై సుప్రీం కోర్టుకు కేంద్రం హామీ

3



విద్యుత్ శాఖ అనాలోచిత నిర్ణయ ఫలితం

## పేదోళ్లకు 'కంకర' భారం!

పీసీబీ అనుమతుల పేరిట క్రషర్ల కనెక్షన్ల కట్
వందల సంఖ్యలో మూత పడ్డ కంకర మిల్లులు
మూడింతలు పెరిగిన ధరలు
మరింత భారంగా ఇందిరమ్మ ఇళ్ల ఖర్చు
భద్రత పేరుతో రవాణాశాఖ రాయల్టీ వసూలు
ఇదే అదనుగా సొమ్ము చేసుకుంటున్న దళారీలు

5



## మూడు రోజుల పాత బిర్యానీ డెలివరీ

హోటల్ సీజ్
ఆన్‌లైన్ ఆర్డర్‌లో కుళ్లిపోయిన బిర్యానీ వెలుగులోకి*
ఫ్రిడ్జ్‌లో 80 ప్యాకెట్లు నిల్వ ఉంచినట్లు గుర్తింపు
అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకలు, బొద్దింకలు సంచారం
హోటల్ యజమానిపై కేసు

2





మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే

## కాంగ్రెస్ సంకల్పం

డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం
'సంఘటన్ శ్రీజన్ అభియాన్' సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

3



### రేవంత్‌ది గడీల, బేడీల, గుడ్డి పాలన

- పరిగిలో భూములు లాక్కునే యత్నం
- రైతుల పరామర్శకు వెళ్తున్న హరీష్‌రావు తదితరుల అరెస్ట్
- శంషాబాద్ పీఎస్ వద్ద సీఎంపై విరుచుకుపడ్డ హరీష్

2

తెలంగాణ ఆడిట్ శాఖ

## దేశంలోనే నెంబర్ వన్

గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి



3




# వేల కోట్లు దోచేశారు..!

(మొదటి పేజీ తరువాయి)

చేసేది మరొకటి అని రిపోర్టు తేటతెల్లం చేసింది. అంచనాలకు, చేస్తున్న ఖర్చులకు ఏమాత్రం పొంతనలేకుండా ఉంది. సంక్షేమ రంగానికి,

**ఫిర్యాదుల్లో జాప్యంతో నష్టం**

సైబర్ నేరాలను నియంత్రించేందుకు కేంద్రం ప్రత్యేకంగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) ఏర్పాటు చేసింది. మోసం జరిగిన వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేస్తే డబ్బు మరింత దారి మళ్లకుండా అడ్డుకునే అవకాశం ఉంటుంది. అయితే చాలామంది ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో నష్టాలు పెరుగుతున్నాయి.

**రూ.55 వేల కోట్ల నష్టం**

2020 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల సుమారు రూ.55 వేల కోట్ల నష్టం సంభవించింది. అందులో రూ.8,690 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. మిగతా డబ్బును నేరగాళ్లు వివిధ మార్గాల్లో మాయంచేశారు. 252 కీలక కేసుల్లోనే రూ.35,925 కోట్లకు పైగా నగదు మళ్లింపును ఈడీ గుర్తించింది.

**ఖాతాదారులపై విచారణ**

సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా బ్యాంకు ఖాతాల ద్వారానే జరిగాయని గుర్తించిన అధికారులు, ఆ ఖాతాదారులతో నేరగాళ్లకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. డబ్బు చివరకు ఎవరి ఖాతాలో జమైందో, ఆ సొమ్మును ఎలా వినియోగించారో తెలుసుకునేందుకు విచారణ చేపట్టనున్నారు.


**ఆస్తుల జప్తు, బాధితులకు న్యాయం**

నేరగాళ్లు కూడబెట్టుకున్న ఆస్తులను జప్తు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధితులకు పంపిణీ చేయడమే ఈడీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. క్రిప్టో రూపంలో విదేశాలకు తరలించిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇటీవల భారీ స్థాయిలో సైబర్ మోసాలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

# మూడు రోజుల పాత బిర్యానీ డెలివరీ

హైదరాబాద్, ఏప్రిల్ 7:

నేటి ఆధునిక జీవన విధానంలో స్మార్ట్ ఫోన్ వినియోగం పెరగడంతో ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా ఆహారం ఆర్డర్ చేయడం సాధారణంగా మారింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అనేక హోటళ్లు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. అయితే కొంతమంది వ్యాపారులు నాణ్యతను పట్టించుకోకుండా వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసిన బిర్యానీ కుళ్లిపోయిన స్థితిలో డెలివరీ కావడంతో హోటల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం తయారుచేసిన ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెంబర్2 ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఉదయం Zomato యాప్ ద్వారా చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అదే ప్రాంతంలోని "లక్కీ బిర్యానీ షావర్మ" రెస్టారెంట్ నుంచి వచ్చిన బిర్యానీ పొట్లం తెరిచి చూడగా దుర్వాసన రావడంతో అనుమానం వ్యక్తమైంది. పరిశీలించగా బిర్యానీ కుళ్లిపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు హోటల్‌లో తనిఖీలు చేపట్టగా పలు అనుమానాస్పద విషయాలు బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌లో సుమారు 80 బిర్యానీ ప్యాకెట్లు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అలాగే ఫ్రిడ్జ్‌లో ఎలుకలు సంచరిస్తున్న దృశ్యాలు కూడా కనిపించాయి. దర్యాప్తులో భాగంగా జీడిమెట్ల ప్రాంతానికి చెందిన హోటల్ యజమాని ఇర్ఫాన్ మూడు రోజుల క్రితం తయారుచేసిన బిర్యానీని ప్యాకెట్లుగా సిద్ధం చేసి బంజారాహిల్స్ అవుట్‌లెట్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అపరిశుభ్ర పరిస్థితులు, దుర్వాసనలు, ఎలుకలు, బొద్దింకలతో నిండిన ఆ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. అలాగే హోటల్ యజమాని ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించి ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై పోలీసులు నిఘా పెంచారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పాడైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే HFAST నంబర్ 8712661212కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# రేవంత్‌ది గడీల, బేడీల, గుడ్డి పాలన

హైదరాబాద్, ఏప్రిల్ 7:

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆరఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సూటిగా ప్రశ్నించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ రేవంత్.. నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారన్నారు. రేవంత్ రెడ్డిది గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా అని ఈ సందర్భంగా హరీష్ రావు ప్రశ్నించారు. పోలీసు నిర్బంధం, అణచివేతల మధ్య హరీష్‌రావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావులతో కలిసి పరిగి రైతుల వద్దకు బయల్దేరారు. మార్గంమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. హరీష్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డు□□డ్డంగా పెట్టారు. హరీష్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆరఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆరఎస్ శ్రేణులు రోడ్డుపై



బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వారందరినీ శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**రేవంత్ ఆలోచనలన్నీ భూముల చుట్టూనే.**

సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతది అన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు అన్నీ భూమి చుట్టే తిరుగుతున్నయి అని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు వ్యాఖ్యానించారు. లగచర్ల అంటడు.. హెచ్‌సీయూ అంటడు.. హిల్‌ట్‌పీ అంటడు.. నాదర్‌గుల్ భూములు అంటడు.. ఇవ్వాళ పరిగిలో భూములు లాక్కుంటడు.. పాలన చేయమంటే భూముల మీద పడ్డడు అని విమర్శించారు. నాటి ఇందిరమ్మ భూములు ఇస్తే నేటి ఇందిరమ్మ పాలనలో పేదల భూములు లాక్కుంటున్నడన్నారు. పరిగి నియోజకవర్గంలో దళిత, గిరిజన బలహీనవర్గాల భూములను ఇండస్ట్రియల్ పార్కుల పేరిట ప్రభుత్వం గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని, రైతుల పక్షాన పోరాడటానికి తమ నాయకులు వెళ్తుంటే అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎందుకు ఈ ప్రభుత్వం అంత భయపడుతున్నదని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా తాము పరిగి రైతుల వద్దకు వెళ్తుంటే అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యం అనే ఏడో గ్యారెంటీ ఇస్తున్నాం.. ప్రజలకు ప్రశ్నించే హక్కు కల్పిస్తం అన్నరు.. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బలహీనవర్గాల గొంతుకగా మాట్లాడుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తమ మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని అరెస్టు చేసి గంటకో పోలీసు స్టేషన్‌కు పంపుతున్నారంటూ మండిపడ్డారు. రైతుల గోస వినడానికి కల్లాపూర్ దగ్గర మీటింగ్ పెట్టుకున్నామని, ఉదయాన్నే పోలీసులు వెళ్లి టెంట్లు చింపి రైతులను, మహిళలను అరెస్టు చేశారని, అక్కడికొస్తే కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేకుండా చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. రేవంతు పరిస్థితి పిచ్చోడు చేతిలో రాయిలా అయిందని, ఎప్పుడు ఎవరి మీద రాయి విసురుతడో తెల్వది.. మూసీ పేరిట అపార్టుమెంట్లు కూల్చుతడు.. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చుతడు.. యూనివర్సిటీ భూములు లాక్కుంటడు.. వ్యవసాయ మార్కెట్ భూములు లాక్కుంటున్నడు.. లగచర్ల లాంటిదే పరిగిలో చేస్తున్నడు అని ఆరోపించారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల భూముల మీద రేవంత్ రెడ్డి దండయాత్ర చేస్తున్నడన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నరేండ్లలో పరిశ్రమలు పెడతాం అని నోటిఫికేషన్లు ఇచ్చి 10వేల ఎకరాల దళితుల, ఎస్టీల భూములు లాక్కున్నడు.. ఇంక 40వేల ఎకరాల భూములు లాక్కుంటడట.. ఎందుకు భూముల మీద దండ యాత్ర చేస్తున్నవు అని అడగడానికి వెళ్తున్నం అని అన్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ఉండి వికారాబాద్ జిల్లాకు శాపం అయ్యిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నరంటూ నువ్వు అడ్డుకోవాలని చూసినా మా పోరాటం ఆగదు.. బాజాప్తు రైతుల వద్దకు వెళ్తం.. వాళ్ల పోరాటానికి బాసటగా నిలుస్తం అని హరీష్‌రావు స్పష్టం చేశారు. ఎక్కడ అసైన్డ్ భూమి ఉంటే అక్కడ గద్దల్లా వాలుతున్నారన్నారు. తుమ్మల గారు నేను చెప్పిందే చెప్పారు.. అందుకు ధన్యవాదాలు.. కేసీఆర్ ఆలోచనలతో ఫౌండేషన్ వేసింది, నిధులు ఇచ్చింది తాము.. రెడీగా ఉన్న భూములను ఇండస్ట్రీలకు ఇస్తం, పక్కన పంచాయతీలో ఉన్న దిల్ భూములను మార్కెట్ యార్డుకు ఇస్తం అంటడు.. 11 ఏళ్లుగా హైకోర్టులో కేసు క్లియర్ కాలేదని, మీరు రైతు పక్షపాతి అయితే ఇక్కడే టెండర్ పిలిచి అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మించండి అని మంత్రికి హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. భూముల వెంట పడకండి.. 22ఏ నిషేధిత జాబితాపై సమీక్షించి తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని పరిగి రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, అప్పటిదాకా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

# కేరళంలో పంచాయతీరాజ్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

విజయన్ వైదొలగే సమయం ఆసన్నమైందన్నారు. యూడీఎఫ్ మూడింట రెండొంతుల మెజారిటీతో గెలవబోతున్నదని జోస్యం చెప్పారు. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తామన్నారు. కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని, దాంతో ఇక్కడ వృద్ధులు చిన్న పిల్లలే కనిపిస్తున్నారంటూ ఇది దురదృష్టకరమని అన్నారు. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్నారు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం, తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళంలో అమలు చేస్తాం అని హామీ ఇచ్చారు. విజయన్‌తోపాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తాను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాం.. ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చు అన్నారు. ఈ విషయంలో విజయన్‌కు సవాల్ విసురుతున్నా.. మేం 67 వేల ఉద్యోగాలు ఇచ్చాం.. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.20,670 కోట్ల రుణ మాఫీ చేశాం.. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం.. 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నాం అని చెప్పారు. ఎన్నికలు కేరళం.. తెలంగాణ మధ్య కాదు



యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి.. మేం ఏం చేస్తున్నామో అది చెబుతున్నాం.. మా సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలి అని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగాఏఎన్ఐతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విజయన్ తనకు రాసిన లేఖలో 201423 మధ్య విషయాలను ప్రస్తావించారు.. ఆ కాలంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. ఆయన లేఖలోని తప్పులన్నీ జరిగినందునే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మార్చివేశారు.. ఇప్పుడు విజయన్‌ను కేరళం ప్రజలు మార్చివేస్తారు.. విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, బంగారం స్మగ్లింగ్ కేసులున్నాయి అని గుర్తు చేశారు. విజయన్ గాడ్‌ఫాదర్ నరేంద్ర మోదీ ఢిల్లీలో ఉన్నారని, మోదీనే ఈ కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షిస్తున్నారని విమర్శించారు. దేశం కోసం తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని రకరకాల కేసులతో వేధిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ సహా అనేకమంది నేతలను ఈడీ కేసులతో వేధించి అరెస్టు చేసిన వాళ్లు ఎందుకు విజయన్ జోలికి రావడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు అని ఎద్దేవా చేశారు. మోదీ.. విజయన్ బంధాన్ని కేరళం ప్రజలు అర్థం చేసుకున్నారు.. సరైన నిర్ణయం తీసుకుంటారు.. కేరళంలో మార్పు వస్తుంది అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# లష్కరే తొయిబా ముఠా అరెస్టు

- 16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాదిని పట్టుకున్న పోలీసులు

శ్రీనగర్, ఏప్రిల్ 7:

శ్రీనగర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్రాష్ట్ర లష్కరే తొయిబా ఉగ్ర ముఠాను జమ్ము కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ చర్యల్లో ఇద్దరు పాక్ ఉగ్రవాదులతో పాటు ముగ్గురు స్థానికులను అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్లా అలియాస్ అబు హురైరా అనే ఉగ్రవాది గత 16 ఏళ్లుగా భద్రతా బలగాలకు చిక్కకుండా తిరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. జమ్ము కశ్మీర్ వెలుపల ప్రాంతాలకు కూడా లష్కరే తొయిబా కార్యకలాపాలను విస్తరించడంలో అతడి పాత్ర ఉన్నట్లు వెల్లడించారు. మరో పాక్ ఉగ్రవాది ఉస్మాన్ అలియాస్ కుబైబ్‌ను ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌తో అతడికి సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల్లోని 19 ప్రాంతాల్లో పోలీసులు ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆయుధాలు, నకిలీ గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల చిరునామాలతో తయారు చేసిన నకిలీ పత్రాలను ఉపయోగించి నిందితులు దేశవ్యాప్తంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. గత నెల 31న శ్రీనగర్‌కు చెందిన నకీబ్ భట్ అనే వ్యక్తి పోలీసులకు చిక్కడంతో ఈ ఉగ్ర ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.



# మావోయిస్టు విముక్త తెలంగాణ

ములుగు, ఏప్రిల్ 7:

తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కొద్దిమంది మాత్రమే ఉద్యమంలో ఉన్నారని, వారు కూడా బయటకు రావాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణతో కలిసి డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టల ప్రాంతంలోని పాముసూరు పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమిపూజ చేసి, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టల ప్రాంతం చాలా కాలంగా అభివృద్ధికి దూరంగా ఉందని, అక్కడి గూడేల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు అందలేదని తెలిపారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమమవుతోందని పేర్కొన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకమని అన్నారు. కర్రెగుట్టల ప్రాంతాన్ని మిగతా ప్రపంచంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు.



ఇప్పటి వరకు 13 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు. మున్ముందు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పాముసూరు గ్రామస్థులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, సోలార్ లాంతర్లను డీజీపీ పంపిణీ చేశారు. అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్లు నిర్మిస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక రోడ్డు భద్రతపై కూడా డీజీపీ అవగాహన కల్పించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో పాల్గొని, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరుగుతుందని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.



# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
దేశంలో అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆయన సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియాను అధికంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడపీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. అందువల్ల యూరియాను శాస్త్రీయంగా వాడాలని సూచించారు. యూరియా యాప్, యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 'రైతు నేస్తం'లో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని తగిన సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కావడంలేదని రైతులు యూరియా యాప్‌ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్‌తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పుడు పంట కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందన్నారు.

***మంత్రిని కలిసిన హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం**

సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీహుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్



**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందని, వరుసగా మూడుసార్లు దేశంలో నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్రంలో ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు వచ్చిన గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. గుజరాత్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఉన్నతాధికారులందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నానన్నారు. తమ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్రంలో ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయసహకారాలను అందిస్తామని, రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను అర్థం చేసుకోవడానికి తమ అధికారులు పూర్తిగా సహకరిస్తారని గుజరాత్ అధికారులతో డిప్యూటీ సీఎం తెలిపారు. రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని, రాష్ట్రంలో ఆడిటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతున్నదని గుజరాత్ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో పరిష్కరిస్తాం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07:**
దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన సమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చింది. ఈ అంశంపై సమగ్ర సమీక్ష కొనసాగుతోందని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ధర్మాసనానికి తెలిపారు. సీసీటీవీల పనితీరుపై ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అమికస్ క్యూరీ, కేంద్ర హోం కార్యదర్శితో వరుస సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పలు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో పనిచేయని సీసీటీవీల అంశంపై దాఖలైన పలు పిటిషన్లతో పాటు సుమోటోగా స్వీకరించిన కేసుపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోం కార్యదర్శి కూడా విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఈ కేసును సుప్రీం కోర్టు ఏప్రిల్ 28కు వాయిదా వేసింది.



తదుపరి విచారణకు ముందు అమికస్ క్యూరీ తాజా స్థితిగతుల నివేదిక సమర్పించాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేయవచ్చని ధర్మాసనం సూచించింది. ప్రత్యేక పరిస్థితులు లేకపోతే భవిష్యత్తులో హోం కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.

# ప్రజారోగ్యమే సమాజానికి బలమైన పునాది

**హైదరాబాద్, ఏప్రిల్ 7:**
ఆరోగ్యం కోసం ఐక్యంగా.. విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా అనే థీమ్‌తో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇది ఆరోగ్య రంగంలో శాస్త్ర సహకారం, ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యం అంటే వ్యాధులు లేకపోవడ□మే కాదు.. శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరమని, ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, సపోర్టింగ్ స్టాఫ్ సేవల వల్లే ప్రజల ఆరోగ్యం రక్షితంగా ఉందంటూ కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో సేవలందించిన వైద్య సిబ్బందికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాథమికస్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీస్థాయి వరకు ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామని, మౌలిక వసతులు, మానవ వనరులు, ఔషధాలు, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జీవన శైలిలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం తదితర కారణాలతో డయాబెటిస్, బీపీ, గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్ వంటి నాన్ కమ్యునికబుల్ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఇవి ప్రజలపై ఆర్థిక భారం పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరేటివ్, రిహాబిలిటేటివ్ విధానంతో సమగ్ర ఆరోగ్య సేవలనందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీ క్లినిక్స్, డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, పాలియేటివ్, జెరియాట్రిక్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా 79 డయాలిసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 109 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర సేవలను బలోపేతం చేస్తున్నామని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడేందుకు ప్రతి 35 కి.మీ కు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రూ.1100 కోట్లతో నాలుగు స్థాయిల



ట్రామా కేర్ వ్యవస్థను అమలు చేయబోతున్నామని వివరించారు. అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తూ 213 కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, త్వరలో మరిన్ని అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొస్తామని, 10 నిమిషాల లోపు ఘటనా స్థలానికి అంబులెన్స్ చేరుకునే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈరోజు క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామన్నారు. క్యాన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందిస్తామని, ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్ల ద్వారా చికిత్సను ప్రజలకు చేరువ చేశామని, ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పాలియేటివ్ కేర్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈరోజు నిమ్స్‌లో అత్యాధునిక లినాక్ సేవలను ప్రారంభించామని, రాష్ట్రంలో రీజినల్ క్యాన్సర్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్ట్రాజెనెకాతో కలిసి 20 ప్రభుత్వ హాస్పిటళ్లలో లంగ్ క్యాన్సర్ ముందస్తు నిర్ధారణపై పైలట్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తున్నామని, ఇందుకోసం ఆస్ట్రాజెనెకాతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ప్రతి పౌరుడికీ□ హెల్త్ ప్రొఫైల్ రూపొందించే దిశగా చర్యలు ప్రారంభించామని, 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్టు పోర్టల్‌ను ప్రారంభించామని, పీసీపీఎన్‌డీటీ, ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలుకు ప్రత్యేక పోర్టల్స్ తీసుకొచ్చామని, పారదర్శకత, నాణ్యత, బాధ్యతాయుత వ్యవస్థను తయారు చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరిస్తూ ప్రజల ఆర్థిక భారం తగ్గిస్తున్నామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొస్తున్నామని, జిల్లా స్థాయిలోనే 80% వైద్య అవసరాలు తీర్చే లక్ష్యంతో సెకండరీ హెల్త్‌కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ హెల్త్ సిటీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం చేపడుతున్నామని, నిమ్స్‌లో 2000 పడకల కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆరోగ్య శాఖలో రెండేళ్లలో 10 వేల పోస్టులు భర్తీ చేశామని, ఇంకా 7 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. క్యాన్సర్, ఇతర వ్యాధులపై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని మంత్రి దామోదర పిలుపునిచ్చారు. కాగా, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మంత్రి అవార్డులు అందజేశారు.

**అందుబాటులోకి కచ్చితమైన రేడియేషన్ చికిత్స**

నిమ్స్‌లో అత్యాధునిక లినాక్(లినియర్ యాక్సలరేటర్) సేవలను ప్రారంభించడంతో కేన్సర్ రోగులకు ఖచ్చితమైన రేడియేషన్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రూ.33 కోట్లతో నిమ్స్ కేన్సర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఈ సేవలను ఆయన మంగళవారం ప్రారంభించారు. సేవల ప్రారంభంతో తెలంగాణలో క్యాన్సర్ చికిత్స మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. ఈ ఆధునిక సాంకేతికతతో ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపించి, ఆరోగ్య కణజాలాన్ని కాపాడే చికిత్స అందించగలుగుతామన్నారు. ట్రూ బీమ్ సిస్టమ్‌తో తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం కల్పించామని, కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యేటా 55 వేల నుంచి 60 వేల కొత్త కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా కేన్సర్ చికిత్స అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టామని, అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తున్నామని, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈరోజు నుంచి నిమ్స్‌లో మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించామని, మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని చెప్పారు. 14నుంచి 15ఏళ్ల బాలికలకు ఉచితంగా టీకా అందిస్తూ గర్భాశయ కేన్సర్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు కేన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామని, తద్వారా ప్రతి కేన్సర్ కేసును నమోదు చేసే విధానం తీసుకొస్తున్నామని, కేన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందించగలుగుతామని చెప్పారు. కేన్సర్‌పై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మంత్రి దామోదర్ అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పం

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 07:**
మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పమని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం రోజునమహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి , టిపిసిసి జనరల్ సెక్రటరీలు ,తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడారు . పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యం అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోంది. ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తె పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇస్తామన్నారు.పదేళ్ల బిఆర్ ఎస్ ఆర్థిక విధ్వంసాన్ని ఎత్తి చూపి తీరాల్సిందేన్నారు.

విజన్ లేకుండా బిఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు.సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్, మహత్యాగాలు చేసిన కుటుంబం గాంధీ కుటుంబం అని చెప్పారు. మోదీ 12 ఏళ్ల కాలంలో అధికారం పరమావధిగా కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ విచ్చిన్నం చేసే కుట్రలు చేసిందన్నారు.

**బీజేపీ హయంలో పెట్రోల్,డీజిల్ రెట్లు తగ్గాయా?**

2 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా?శ్రీరాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం బీజేపీ నేతల నైజం అని ఘాటుగా విమర్శించారు.పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ కావాలన్నారు.రాజకీయం చైతన్యం కలిగిన జిల్లా మహబూబ్ నగర్ అని ,ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ. అభివృద్ధి, సంక్షేమన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నారు.కేటీఆర్ ,హరీష్ రావు నిత్యం అసత్యాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారనీ మండిపడ్డారు. కష్టపడితే ఫలితం వస్తుంది అనడానికి నేను పిసిసి కావడం ఓ ఉదాహరణఅని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష 20 వేల కోట్లు గోదావరిలో పోశారనీ ఘాటుగావిమర్శించారు. కాంట్రాక్టుల జేబులు నింపడం కోసం ప్రాజెక్టులు కట్టారని పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ఈ సందర్భంగా ఘాటుగా విమర్శలు చేశారు.

## కల్లియాస్సేరి నియోజకవర్గంలో

# భారీ రోడ్ షో

**కేరళం, ఏప్రిల్ 07:**
కల్లియాస్సేరి నియోజకవర్గంలో సోమవారం రోజున భారీ మరియు ఉత్సాహభరితమైన రోడ్ షో నిర్వహించబడింది. ఈ రోడ్ షోలో ప్రజల నుంచి లభించిన అపార స్పందన యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)కు పెరుగుతున్న మద్దతును స్పష్టంగా తెలియజేస్తోంది.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు హర్కర వేణుగోపాల్ రావు, కాసరగోడ్ లోక్‌సభ సభ్యులు రాజ్‌మోహన్ ఉన్నితాన్, కల్లియాస్సేరి అసెంబ్లీ యూడీఎఫ్ అభ్యర్థి రాజీవన్ కప్పచేరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన యూడీఎఫ్ విజయానికి సంకేతమని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకమై కృషి చేస్తుండటం వల్ల ఈ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఐఎస్ అధికారులు

- **బలాన్ని కాకుండా మేధస్సుతో చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగాన నిలవండి**
- **కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అట్టడుగువారికి చేరేలా సమాచార వ్యాప్తి చేయండి**
- **ఐఐఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**
- **2009, 2023, 2024 ఐఐఎస్ ట్రైనీ అధికారులతో కేంద్ర మంత్రి భేటీ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07:**
దేశ భద్రత, సంక్షోభ సమాయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఐఐఎస్ అధికారులు సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదని, సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలవాలని కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) 2009,



2023, 2024 బ్యాచ్ లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈనెల 15 నుండి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకాలజికల్ ఆపరేషన్స్ పై అవగాహన పెంపొందించుకునేందుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రోజున సాయంత్రం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆయా ట్రైనీ అధికారులు మర్యాదపూర్వంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయా అధికారుల విద్య, కుటుంబ నేపథ్య వివరాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ లోకి రావడానికి కారణాలపైనా ఆరా తీశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయా? లేదా? అట్టడుగునున్న అణగారిని వ్యక్తుల వరకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందాలంటే ఏం చేస్తే బాగుంటుందనే అంశాలపైనా ఆరా తీశారు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో సేవలు ఎలా మారుతున్నాయి? భవిష్యత్తులో ఎలా ఉండబోతుందనే అంశాలతోపాటు మారుమూల గ్రామాలకు సైతం సమాచారం చేరేలా కమ్యూనికేషన్ బలపడేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా వారితో చర్చించారు.

అనంతరం వారిని ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూలస్థంభమని చెప్పారు. ఈ విషయంలో ఐఐఎస్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత భద్రతకు సంబంధించిన విషయానికొస్తే... మీడియా, సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్న నేటి తరుణంలో వాటిని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మధ్యవర్తిగా పనిచేసేలా సిద్ధం కావాలని సూచించారు. "దేశం మీమీద ఆశలు పెట్టుకుంది. మీరు కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదు. సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలి"అని సూచించారు. "యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఈ విషయంలో బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగా నిలవాలి"అని కోరారు. ముఖ్యంగా దేశ భద్రత, సంక్షోభ సమాయాల్లో తప్పుడు సమాచారాన్ని పంపుతూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐఐఎస్ అధికారుల పాత్ర చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్సు డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**రామచంద్రపురం, ఏప్రిల్ 7, ( సిరి న్యూస్ ):**

పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు. మంగళవారం ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ. 7,29,000 విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు, ముఖ్యంగా వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## గీతంలో పీహెచ్.డీ. ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

GITAM
DEEMED TO BE UNIVERSITY

**రామచంద్రపురం, ఏప్రిల్ 7 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2026–27 విద్యా సంవత్సరానికి పీహెచ్.డీ. ప్రోగ్రామ్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం ప్రాంగణాల్లో ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, హ్యూమానిటీస్, లా విభాగాల్లో ఫుల్–టైమ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ తెలిపారు.సంబంధిత మాస్టర్స్ డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు లేదా నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపిక ప్రక్రియ గీతం రీసెర్చ్ అడ్మిషన్స్ టెస్ట్ (GReAT) మరియు ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుందని తెలిపారు.దరఖాస్తులకు చివరి తేదీ మే 11, 2026. ప్రవేశ పరీక్షలు మే 23న ఆన్‌లైన్‌లో, మే 30న ప్రత్యక్షంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఫుల్–టైమ్ పరిశోధకులకు మూడు సంవత్సరాల వరకు నెలకు రూ.33 వేల ఫెలోషిప్ అందించనున్నట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది.ఆసక్తి గల అభ్యర్థులు గీతం అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0891-2866411ను సంప్రదించవచ్చని, phdsupport@gitam.edu కు ఈ-మెయిల్ చేయవచ్చని తెలిపారు.

## భూసార సంరక్షణ అభియాన్




**తూప్రాన్ ఏప్రిల్ 7 సిరి న్యూస్**

తూప్రాన్ మండలంలోని గుండ్రెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రోజు భూమి సుభాషణ భూసార సంరక్షణ దేశవ్యాప్త జన అభియాన్ లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ శిక్షణ కార్యక్రమంలో తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకుంటూ సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అలాగే పచ్చిరొట్ట పంటలు సాగుచేస్తూ భూమి యొక్క పోషకాలను మెరుగుపరచుకుంటూ యాజమాన్య పద్ధతులు చేపట్టినట్టయితే భూమి సమతుల్యత దెబ్బతినకుండా భూమిలోని సేంద్రియ కార్బన్ పెంచుకోవడంతో పాటు భూమి యొక్క పోషకాలు మెరుగుపడి రైతులకు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు మండల వ్యవసాయ అధికారి పి గంగామల్లు మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పోషక యాజమాన్య పద్ధతులు చేపట్టాలని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు అధికమోతాదులో వాడాలని రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో రైతు సోదరులు శాస్త్రవేత్తలు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు

# అబాకస్ పోటీల్లో 'సెయింట్ ఆంథోనీ' ప్రభంజనం

- **వేళ్ల సహాయంతోనే అవలీలగా గణిత ప్రావీణ్యం**
- **గోల్డ్, సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్న విద్యార్థులు**

**సంగారెడ్డి, ఏప్రిల్ 07 (సిరి న్యూస్):**





స్థానిక శాంతినగర్ లోని సెయింట్ ఆంథోనీ పాఠశాల వేదికగా మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్, అంగులీయ అబాకస్, ఫింగర్ అబాకస్ పోటీల్లో విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరిచారు. తమ మేధస్సుతో అత్యంత క్లిష్టమైన లెక్కలను కూడా చిటికెలో ఛేదించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఎటువంటి క్యాలిక్యులేటర్లు, పెన్ను, పేపర్‌ను ఉపయోగించకుండా కేవలం వేళ్ల సహాయంతో (అంగులీయ పద్ధతిలో) అత్యంత వేగంగా కూడికలు, తీసివేతలు చేస్తూ తమ అసాధారణ ఏకాగ్రతను చాటుకున్నారు. విద్యార్థుల వేగం, ఖచ్చితత్వాన్ని చూసి అక్కడికి వచ్చిన వారు మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి మాట్లాడుతూ.. అబాకస్ శిక్షణ అనేది కేవలం గణితానికే పరిమితం కాదని, దీనివల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, సృజనాత్మకత గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. నేటి విద్యార్థుల ప్రతిభను చూస్తుంటే భవిష్యత్తులో వీరు గొప్ప గణిత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ. అరుణ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారుచ వెండి పతకాలను అందజేశారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో గణితంపై పట్టు సాధించేందుకు అంగులీయ అబాకస్ ఒక సంజీవనిలా పనిచేస్తుంది. మా పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో మెడల్స్ సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడం గర్వకారణం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, అబాకస్ శిక్షకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాన రోడ్డుపై డబుల్‌బెడ్ రూం నిర్వాసితుల రాస్తారోకో

- **కాంట్రాక్టు దక్కలేదని డ్రైనేజీ పనులను అడ్డుకున్న మాజీ ప్రజాప్రతినిధి**
- **డ్రైనేజీ పనులకు రూ.1.52 కోట్లు మంజూరు**
- **మూడేళ్లుగా డ్రైనేజీ సమస్యతో నిర్వాసితుల తిప్పలు**
- **నిర్వాసితులకు అండగా నిలవని మున్సిపల్ కౌన్సిలర్‌లు**

**అందోలు, ఏప్రిల్ 07,(సిరిన్యూస్):**



జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో అందోలు గూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం వద్ద డ్రైనేజీ నిర్మాణం పనులకు గాను ప్రభుత్వం రూ.1.52 కోట్లు మంజూరు చేయగా గత సోమవారం మున్సిపల్ చైర్మన్, కమిషనర్,ఏఈలు పనులకు శంకుస్థాపన చేసారు. పనులు ప్రారంబించిన మూడవ రోజునే అందోలుకు చెందిన మాజీ మున్సిపల్ ప్రజాప్రతినిధి తనకు ఈ కాంట్రాక్టు దక్కలేదన్న అక్కసుతో అందోలు గ్రామస్తులకు ఉసిగొలిపి పనులను నిలిపివేసినట్లు డబుల్ బెడ్‌రూం నిర్వాసితులు అరోపించారు. పనులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటుండడంతో అధ్వాన్యంగా ఉండడంతో గత మూడేళ్లుగా నివాసితులు నరకాన్ని చూస్తున్న నిర్వాసితులు 50మంది కిపైగా మహిళలు, పురుషులు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకోను నిర్వహించారు. చైర్మన్,కమిషనర్‌లు రావాలని నినాదాలు చేసారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు. ఎస్ఐ దుర్గయ్య పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకొని నచ్చజెప్పినా వినిపించుకోకుండా గంటకు పైగా ఆందోళన నిర్వహించారు. మున్సిపల్ అధికారులు వచ్చి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీని ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం....**

తమకు మూడేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూంలను కెటాయించారని, డ్రైనేజీ నీళ్లు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేయకపోవడంతో డబుల్‌బెడ్‌రూం చుట్టూ పెద్ద గుంతలుగా ఏర్పడి మురికినీరంతా చేరింది. పరిసర ప్రాంతాలతో పాటు గదుల్లోకి కూడ దుర్వాసన రావడంతో దోమలు, విషపురుగుల సంచారంతో ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని డబుల్ బెడ్ రూం నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. కొన్ని గదుల్లోకి మురికినీరు కూడా వచ్చి చేరుతుందని వారు ఆవేదన వ్యక్తం చేసారు. పెద్ద గుంతగా ఏర్పడి మురికి నీరు నిల్వడంతో చిన్న పిల్లలు అనారోగ్యానికి గురికావడమే కాకుండా ఒకరిద్దరు అనారోగ్యంతో మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. డ్రైనేజీ పనులైనా చేయించండి లేదా తమను వేరొక చోటికి మార్చాలంటూ వారు డిమాండ్ చేసారు. గంటసేపటి వరకు ఆందోళన చేపట్టినా అందోలులోని ఐదుగురు కౌన్సిలర్లలో ఒక్కరు కూడా వారి వద్దకు వచ్చి మద్దతు తెలపకపోవడం విశేషం





# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు





- **ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి**
- **స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ఏప్రిల్, 07(సిరిన్యూస్)**

జిల్లా ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి,పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు.అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు.సీజనల్ వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ,స్థానిక సర్పంచ్ ,పిహెచ్ సి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సోదర భావానికి ప్రతీక 'ఈద్ మీలాప్'

## కులామతాలకు అతీతంగా ఒకే వేదిక పై కలవడం అభినందనీయం

**• మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్**

**మెదక్ ఏప్రిల్,07(సిరిన్యూస్)**





సోదర భావానికి ప్రతీకగా ఈద్ మీలాప్ జరుపుకోవడం అభినందనీయం అని మెదక్ డి ఎస్పీ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్ లో మెదక్ మిల్లీ అసోసియేషన్, గంగా జమున తహెజీబ్, జమతే ఇస్లామి హింద్, ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఈద్ మీలాప్ కార్యక్రమం 9వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జుబేర్ అహ్మద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ సిఐ మహేష్, లు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రంజాన్ తర్వాత ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించడం చాలా అభినం దనీయమన్నారు. మెదక్ పట్టణం,మెదక్ జిల్లా కులమతాలకు అతీతంగా అందరూ అన్ని వర్గాల ప్రజలు తమ తమ పండగలను కలిసిమెలిసి జరుపుకోవడం అనేది ఒక మంచి సందేశాన్ని సోదర భావాన్ని పెంపొందిస్తుందని సూచించారు. మెదక్ పట్టణంలో మూడు రోజుల క్రితం హిందూ దేవాలయం మీద జరిగిన ఘటన పట్ల ముస్లిం సోదరులు సైతం ఖండించడం జరిగిందని ఆ నీచానికి ఒడిగట్టిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ముస్లిం సమాజం డిమాండ్ చేయడం అభినందనీయ మన్నారు. చట్టం తన పని తాను చేసుకొని పోతుందని ఎవరు చట్టానికి అతీతులు కారని ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీస్ శాఖకు తెలియపరచాలని ప్రజల రక్షణ ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు,మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,తెలుగు స్పీకర్ మహమ్మద్ రఫీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మెదక్ చర్చ్ పాస్టర్ శాంతయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్, ఫార్మర్ పబ్లిక్ ప్రసిక్యూటర్ అడ్వకేట్ షేక్ ఫజల్,తదితరులు ప్రసంగిస్తూ కుల మతాలకతీతంగా ఎల్లప్పుడు మెదక్ పట్టణం సుభిక్షంగా ఉంటుందని ఎవరో ఒకరిద్దరు చేస్తున్న ఘటన ద్వారా మొత్తం సమాజానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు.మహమ్మద్ ప్రవక్త దయ, ప్రేమ, పేద ప్రజలకు మన ఇరుగు,పొరుగు ఉన్నవారు ఆకలితో ఉంటే వారికి కడుపునిండా భోజనం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కూడా మన మీద ఉంటుందన్నారు.ఎల్లప్పుడూ సందేశం ఇచ్చే వారిని ఏ మతానికి ఏ మత ప్రార్ధన మందిరాలకు హాని చేయకూడదని ఏ మతానికి కించపరిచే విధంగా వ్యవహరించొద్దని ఖురాన్ లో స్పష్టంగా ఉన్నదని వారు సూచించారు.ఖురాన్ అయిన, భగవద్గీత అయిన, బైబిల్ అయిన, ఒకే సందేశం ఇస్తుందని అదే సందేశం అందరూ సోదరా భావంతో మెలగాలని ఎటువంటి ఘర్షణలకు స్థానం లేకుండా ఉండాలనేదే ఈ యొక్క గ్రంథాల లక్ష్యమని తెలిపారు, ఈ ఘటన జరిగిన వెంటనే మెదక్ మిల్లి అసోసియేషన్ తీవ్రంగా ఖండించిందని ఇస్లాంలో అట్టి వారికి స్థానం లేదని తెలిపారు,కార్యక్రమానికి విచ్చేసిన డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ సిఐ మహేష్, 28 వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లకు, మత పెద్దలకు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఓమర్ ఖాన్,డాక్టర్ సూఫీ సుజాయత్ అలీ, ఫాజిల్ హుస్సేన్, సాదత్ అలీ జకీ, జర్నలిస్టులు మహ్మద్ రియాజుద్దీన్ ,నజీర్ అహ్మద్,అబ్దుల్ రౌఫ్ ,సయ్యద్ గఫ్ఫార్ నియజి,మౌలానా మీర్ అబిద్ అలీ,ముఫ్తీ సబర్ సాహెబ్ ,మీర్ జాఫర్ ఉల్ తాహిర్ , అద్వకేట్ కరోనాకార్ నజీబ్, వాజిద్, ముజీబ్,, మహ్మద్,నవీద్ సులేమాన్ బాబు,రెహ్మాన్,అఖిల్,

షోయబ్, యూసుఫ్ అలి, తదితరులు పాల్గొన్నారు.





# విద్యుత్ శాఖ అనాలోచిత నిర్ణయ ఫలితం పేదోళ్లకు 'కంకర' భారం!

- **పీసీబీ అనుమతుల పేరిట క్రషర్ల కనెక్షన్ల కట్**
- **వందల సంఖ్యలో మూత పడ్డ కంకర మిల్లులు**
- **మూడింతలు పెరిగిన ధరలు**
- **మరింత భారంగా ఇందిరమ్మ ఇళ్ల ఖర్చు**
- **భద్రత పేరుతో రవాణాశాఖ రాయల్టీ వసూలు**
- **ఇదే అదునుగా సొమ్ము చేసుకుంటున్న దళారీలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 07 (సిరి ప్రత్యేక ప్రతినిధి):**

నిర్మాణ రంగానికి వెన్నెముకగా నిలిచే సహజ వనరులు ఇప్పుడు దళారుల చేతుల్లో చిక్కి సామాన్యుడిని దోచుకుం టున్నాయి. ఇప్పటికే కుదేలైన నిర్మాణ రంగానికి తోడు, తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ సంస్థ తీసుకున్న ఒక తప్పుడు నిర్ణయం ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల పేరుతో దాదాపు ఒక్క టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 8వందల పైచిలుకు స్టోన్ క్రషర్ల విద్యుత్ కనెక్షన్లను తొలగించడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైంది.కేవలం హైదరాబాద్ చుట్టుపక్కల నిర్మాణరంగానికి రోజుకు కొన్ని లక్షనుండి రెండులక్షల టన్నుల కంకర,డస్ట్ వాడుతుంటారు. ఇందుకోసం నిరంతంగా వందల సంఖ్యలో క్రషర్లు పనిచేస్తాయి. ఇలా నిరంతరం లక్షల టన్నుల ఉత్పత్తికి విద్యుత్ శాఖ అనాలోచిత నిర్ణయం మూలంగా ఒక్కసారిగా బ్రేక్ పడింది.

### అక్కరలేని నిబంధన.. ఆగని దోపిడీ

సాధారణంగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోతేనే కనెక్షన్ తొలగించే అధికారం విద్యుత్ శాఖకు ఉంటుంది. కానీ, గత డిసెంబర్‌లో అప్పటి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు కాలుష్య నియంత్రణ మండలి నుండి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' ఉంటేనే విద్యుత్ సరఫరా చేస్తామంటూ కొత్త నిబంధన తెరపైకి తెచ్చారు. కేవలం మూడు రోజుల గడువిచ్చి వందల సంఖ్యలో క్రషర్ల కనెక్షన్లు కట్ చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా 80 శాతం క్రషింగ్ ఉత్పత్తి ఒక్కసారిగా నిలిచిపోయింది. ముందస్తు ప్రణాళిక లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం కంకర, డస్ట్‌కు విపరీతమైన డిమాండ్‌ను పెంచింది.

### రవాణా శాఖ జరిమానాలు.. పెరిగిన ఖర్చులు

ఒకవైపు విద్యుత్ కోతలతో ఉత్పత్తి ఆగిపోగా, మరోవైపు రవాణా శాఖ ఓవర్ లోడ్ వాహనాలపై కఠినంగా వ్యవహరించడం ప్రారంభించింది. దీనికితోడు టన్నుకు 180రూపాయల రాయల్టీ వసూలు చేస్తోంది.గత సంవత్సరం చేవెళ్ల నియోజకవర్గంలో ఓవర్ లోడ్ కంకర లారీ బస్సు కు ఢీకొనడంతో పదులసంఖ్యలో ప్రయాణికులు మరణించారు.ఆ ప్రమాదం జరిగిన వెంటనే రవాణా శాఖ తో పాటు మైనింగ్ పిసిబి అధికారులు నిత్యం క్రషర్ల పై నిఘాపెట్టారు.రవాణా శాఖ ఐతే ఏకంగా టన్నుకు 180 రూపాయల రాయల్టీ వసూలు చేయడం మొదలుపెట్టారు.దింతో రాయల్టీ పెరిగిన రవాణా ఖర్చులు మూలంగా ధరలు విపరీతంగా పెరిగాయి . విద్యుత్ శాఖ నిర్ణయం, రవాణా శాఖ నిఘా మరియు రాయల్టీ ఓవర్లోడ్ నియంత్రణ వెరసి కంకర ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయి. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు.



### మూడింతలైన భారం..

గత డిసెంబర్ నెలలో క్రషర్ల వద్ద టన్నుకు రూ. 200 నుండి రూ. 300 వరకు లభించిన కంకర ధర, జనవరి నాటికి వెయ్యి రూపాయలకు చేరి ప్రస్తుతం రూ. 1200 దాటింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలతో పాటు ప్రైవేట్ భవన నిర్మాణాలకు కంకర అవసరం ఎక్కువగా ఉండటంతో ఈ ధరల పెరుగుదల సామాన్యుల నడ్డి విరుస్తోంది. పేదవాడు తన సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి ఇప్పుడు గతంలో కంటే మూడు రెట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

### కోర్టు మొట్టికాయలు వేసినా మారలేదు పరిస్థితి!

విద్యుత్ శాఖ తీసుకున్న అనాలోచిత నిర్ణయంపై క్రషర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం అధికారులకు గట్టి చివాట్లు పెట్టింది. పిసిబి నిబంధనలను అమలు చేయాల్సిన భాద్యత విద్యుత్ శాఖకు ఎక్కడిదని ప్రశ్నిస్తూ, తొలగించిన కనెక్షన్లను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించింది. అయితే, ఈ లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కనెక్షన్ల పునరుద్ధరణలో జాప్యం, దళారుల ప్రమేయం కలగలిసి సామాన్యుడిపై ఆర్థిక భారాన్ని శాశ్వతం చేశాయి. అధికారుల ఒక్క తప్పుడు నిర్ణయం లక్షలాది మంది ప్రజల జేబులకు చిల్లు పెట్టిందనడంలో సందేహం లేదు.

# చెత్త కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

## కమిషనర్ హెచ్చరిక




**రామచంద్రపురం, ఏప్రిల్ 7 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు సర్కిల్–46 పరిధిలో చెత్త కాల్చిన ఘటనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన తీవ్రంగా పరిగణించారు. మంగళవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో ఐఏఎల్ఏ (IALA) పరిధిలో చెత్తను కాల్చిన ఘటనను గుర్తించిన ఆమె, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.చెత్తను కాల్చడం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని పేర్కొన్న కమిషనర్ శ్రీజన, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను కాల్చిన వ్యక్తిని వెంటనే గుర్తించి పోలీసులకు ఫిర్యాదు నమోదు చేయాలని ఆదేశించారు.ఈ ఘటనలో పారిశుధ్య కార్మికులు లేదా శానిటేషన్ ఆటో డ్రైవర్ల ప్రమేయం ఉన్నట్లు తేలితే ఎలాంటి మినహాయింపు లేకుండా విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఐఏఎల్ఏ పరిధిలో చెత్త పేరుకుపోకుండా వెంటనే తొలగించి పరిశుభ్రతను పాటించాలని అధికారులకు సూచించారు.పరిశుభ్రతపై ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, చెత్త కాల్చడం వంటి ఘటనలపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తామని కమిషనర్ శ్రీజన తెలిపారు.ఈ తనిఖీలో పటాన్‌చెరు సర్కిల్–46 డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ





**రామాయంపేట, ఏప్రిల్ 7(సిరి న్యూస్)**

మెదక్ జిల్లా డీఎంహెచ్వో డాక్టర్ శ్రీరామ్ మంగళవారం నాడు ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న

రిజిస్టర్లు మరియు రికార్డులను సరి చూశారు. 99 రోజుల ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' ఆరోగ్య శిబిరాన్ని పర్యవేక్షించారు. లబ్ధిదారులతో మాట్లాడి, అంటువ్యాధులు కాని వ్యాధుల (NCD) రోగులకు మరియు మహిళల ఆరోగ్యానికి అందించే సేవల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు వైద్య అధికారి (MO), పర్యవేక్షకులు, ANMS మరియు ఆశాలు పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో జిన్నారం

## ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్కు విన్నపం



**జిన్నారం ఏప్రిల్ 07 సిరి న్యూస్**

జిన్నారం పురపాలికకు ప్రత్యేక నిధులు కేటాయించండి అంటూ మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్య ను కలిసి వినతి పత్రం అందజేసిన జిన్నారం నూతన పాలకవర్గ సభ్యులు. ఈ సందర్భంగా చైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ జిన్నారం పురపాలక పరిధిలో పెండింగ్లో ఉన్న సివిల్ పనులు డ్రైనేజ్ వ్యవస్థ మరియు రోడ్ల విస్తరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. మౌలిక సదుపాయాల కల్పన,పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా త్రాగునీరు సరఫరాను మెరుగుపరచడం కొరకు నిధులు తప్పనిసరి అవసరమని అన్నారు. కౌన్సిలర్లు అందరూ కలిసికట్టుగా వార్డుల వారిగా ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. లో అనేక సమస్యలు ఉన్నాయి, సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు కలసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. పారిశుద్ధ సిబ్బందికి జీతాలు పెండింగ్లో ఉన్నాయి కాబట్టి ఇలా చెప్పుకుంటూపోతే సమస్యలు చాలా ఉన్నాయని తెలిపారు.స్థానిక సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ నిధుల కేటాయిపు మరియు పెండింగ్ పనుల పూర్తికి సానుకూలంగా స్పందించినట్లు, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు





- నాణ్యమైన బియ్యంను సరఫరా చేయాలి.
- రోగులకు సరైన వైద్యం అందాలి.
- భూ భారతి,ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు.
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**రామాయంపేట, (నిజాంపేట)ఏప్రిల్ 7(సిరి న్యూస్)**

రామాయ ంపేట , నిజాంపేట మండలంలో నగేష్ మంగళవారం నాడు విస్తృతంగా పర్యటించారు.రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలన్నారు. స్టాక్ వివరాలను అడిగితె లుసుకున్నారు. నిజాంపేట్ పిహెచ్సి నీ పరిశీలించి రోగులకు మంచి వైద్యం అందాలన్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు అందించాలని వైద్యులకు సూచనలు అందించారు. అనంతరంని జాంపేట తహసిల్దార్ కార్యాలయన్నీ తనిఖీ చేశారు భూ భారతి దరఖాస్తులను, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు అన్నారు.భూ సర్వే ,ఇసుక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎస్ ఎస్ సి స్పాట్ కేంద్రం వద్ద వివిధ ఉపాధ్యాయ సంఘాల నిరసన

**మెదక్ ఏప్రిల్, 07(సిరిన్యూస్)**




గత సంవత్సరం పదవ తరగతి మూల్యాంకన చేసిన రుసుమును వెంటనే విడుదల చేయాలనీ అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి కార్యాచరణలో భాగంగా రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మెదక్ స్పాట్ మూల్యాంకన కేంద్రం వద్ద మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో మెదక్ జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గత సంవత్సరం మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రుసుము నేటికీ చెల్లించక పోవడం బాధాకరం అని ఆ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.ఎస్ ఎస్ సి మూల్యాంకనం నిధులను 50 శాతం పెంచి,ఈ సంవత్సరం మూల్యాంకనం నిధులను మూల్యాంకనం అయిపోగానే వెంటనే చెల్లించాలని కోరారు.అక్టోబర్ 2025 లో చేసిన కులగనన సర్వేకు సంబంధించిన రెమ్యూనరేషన్ డబ్బులు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మేడి సతీష్ రావు, టిఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏం ప్రణీద్ కుమార్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఐలయ్య,టీపీటీఫ్ జిల్లా అధ్యక్షులు కే యాదగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, యూ టీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు పద్మారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జాక్టో నాయకులు ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ నిర్మాణానికి కేంద్రం కృషి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తుంది
- డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఆదిలాబాద్(సిరిన్యూస్):**



ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టేలా బీజేపీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సోమవారం బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి బాట సభ ఘనవిజయం సాధించడంపై జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సభలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు సభ విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పిప్పిరి సభ వేదికగా ముఖ్యమంత్రి ఆదిలాబాద్ అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం త్వరలో చేపడతామని, ఇది విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని అన్నారు. బోథ్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా నిలిచే కుప్టి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ రైతులకు పెద్ద అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. జూన్ 2 లోపు ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదేవిధంగా ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి పరిశ్రమల అభివృద్ధి సాధిస్తామని, పర్యాటక రంగంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో నిలిపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, గిమ్మ దీపక్, జిల్లా అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, మల్యాల కరుణాకర్, గౌలి సంజీవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్మనీలో ఉద్యోగావకాశాలపై మంత్రి వివేక్ ఉన్నతస్థాయి సమావేశం

**మంచిర్యాల(సిరిన్యూస్):**

తెలంగాణ కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి మంగళవారం జర్మనీలోని హానోవర్ నగరంలో జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్మెంట్ ఏజెన్సీ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా ఈ సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తెలంగాణ నుంచి జర్మనీకి నైపుణ్యంతో కూడిన మానవ వనరుల పంపిణీ అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా నైపుణ్య కార్మికుల కొరత ఉన్న రంగాల్లో తెలంగాణ యువతకు అవకాశాలను గుర్తించే అంశంపై దృష్టి సారించారు. తెలంగాణ యువతకు అవసరమైన నైపుణ్య ప్రమాణాలు, భాషా శిక్షణ, సర్టిఫికేషన్ ప్రక్రియలపై కూడా సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం యువతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి వివేక్ వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ (టామ్కామ్) వంటి సంస్థల ద్వారా యువతకు నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తూ గ్లోబల్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానా కిషోర్, టామ్కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, మేనేజర్ అనిల్ కుమార్, డీఓసీ పీఎంయూ హెడ్ శ్రీనివాస్ రావు, స్కిల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ బాలా రమణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల(సిరిన్యూస్):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల దృష్ట్యా పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఇతర కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిందిగా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్యం, అలంకరణ, మరమ్మత్తులు, త్రాగునీటి ఏర్పాటు, అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ దీపాలంకరణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యవసర సేవల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు అన్ని శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వివరించారు.

# తులం బంగారం ఎప్పుడు ఇస్తారు

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**జైనూర్(సిరిన్యూస్):**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తులం బంగారం కూడా అందిస్తామని హామీ ఇచిచందని, ఆ హామీని ఇప్పటికైనా నెరవేర్చాలని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను త్వరగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**జైనూర్(సిరిన్యూస్):**

మండలంలోని జండాగూడ గ్రామానికి చెందిన కోరంగా రాదాబాయికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా రూ.28వేల ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేద కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం మీరా జాలీంషా, మెస్రం స్పందన భూపతి, పంద్రా కౌసల్య షేకు, సేద్మకి జానేరావు, మడావి లక్ష్మణ్, కోట్నాక్ బాపూజీ, దుర్వ సింధు నగేష్, కాంగ్రెస్ నాయకులు మెస్రం అంబాజీ రావు, పెందుర్ ప్రకాష్, గెడం గోపీచంద్ పాల్గొన్నారు.

# శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జైనూర్(సిరిన్యూస్):**

జైనూర్ మండల కేంద్రంలోని మార్కెటింగ్ కమిటీ గోదాంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన శనగలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు తగిన మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనగ కొనుగోలు కేంద్రం ద్వారా క్వింటాలుకు రూ.5,875 మద్దతు ధరతో కొనుగోలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు, ఆసిఫాబాద్ గ్రంథాలయ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, జైనూర్ ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, జైనూర్ సహకార మాజీ చైర్మన్ కొడప హన్ను పటేల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, డీసీఓ మోహన్, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ ఆడ బీర్షావ్, ఆర్ఐ మోహన్, సహకార బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్, సహకార సీఈఓ సోన్ కాంబ్లే జనార్ధన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ మాజీ జవాన్ మృతి

**నేరడిగొండ(సిరిన్యూస్):**



మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సమీపంలో జాతీయ రహదారి–44పై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఎస్ఎఫ్ మాజీ జవాన్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండల కేంద్రానికి చెందిన బీఎస్ఎఫ్ మాజీ జవాన్ జక్కులవార్ మురళి సోమవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం అతన్ని బలంగా ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం ద్వారా ఘటన గురించి తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# హత్య కేసు నిందితుడు మళ్లీ అరెస్ట్

**• రెండు ప్రత్యేక బృందాలతో పట్టుకున్న పోలీసులు**

**ఆసిఫాబాద్(సిరిన్యూస్):**



తిర్యాణి మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హన్మంతరావును హత్య చేసిన కేసులో పరారీలో ఉన్న నిందితుడు రాయిసిడం వినోద్ కుమార్‌ను మంగళవారం ఉదయం గోలేటి ఎక్స్‌రోడ్ ఆటో స్టాండ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. రెబ్బెన సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. హన్మంతరావ్ మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో వినోద్, అతని కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని భావించిన నేపథ్యంలో గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి ఇరువర్గాలు శాంతిగా ఉండాలని సూచించినప్పటికీ వివాదం కొనసాగిందన్నారు. ఈ క్రమంలో 2025 నవంబర్ 1న పొలంలో పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న హన్మంతరావుపై వినోద్ తన ఇంటి ముందు గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో హన్మంతరావ్ మెడపై తీవ్ర గాయాలు కాగా, చెవి కూడా తెగిపోయినట్లు గుర్తించామని చెప్పారు. సంఘటన సమయంలో అక్కడే ఉన్న హన్మంతరావ్ భార్య బొజ్జు బాయిని కూడా హత్య చేస్తానని నిందితుడు బెదిరించడంతో ఆమె భయంతో అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వినోద్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో మూత్ర విసర్జనకు వెళ్తానని చెప్పి విధుల్లో ఉన్న సిబ్బందిని తోసివేసి పరారైనట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో మరో కేసు కూడా నమోదు చేసినట్లు అన్నారు. నిందితుడు పరారీలో ఉండటంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కఠిన నిఘా నేపథ్యంలో మంగళవారం నిందితుడు వినోద్‌ను మళ్లీ అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. అనంతరం విచారణ జరిపి చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. హత్య కేసులో పరారైన నిందితుడిని పట్టుకోవడంలో తిర్యాణి ఎస్సై వెంకటేష్ బృందం చాకచక్యంగా వ్యవహరించిందని ఏఎస్పీ చిత్తరంజన్ ప్రశంసించారు. నిందితుడు జన్నారంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి తిర్యాణి వస్తుండగా మాటువేసి పట్టుకున్న సీఐ సంజయ్ కుమార్, ఎస్సై వెంకటేష్‌లను అభినందించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులకు రివార్డులు కూడా అందజేశారు.

# ద్వారకాపూర్‌లో జల్ మహోత్సవం

**• ఇంటింటికీ భరోసా ఇస్తున్న మిషన్ భగీరథ**

**తాండూర్(సిరిన్యూస్):**



పల్లెల్లో ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన తాగునీటి సరఫరా కొనసాగుతోందని బెల్లంపల్లి సబ్ డివిజన్ డీఈఈ (ఇంట్రా) మల్లయ్య తెలిపారు. మంగళవారం తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామంలో జల్ జీవన్ మిషన్ (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో జల్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికీ పైపులైన్ల ద్వారా అత్యంత శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తోందన్నారు. ప్రజలు బయట ఉన్న కలుషిత నీటి వనరులను వినియోగించి అనారోగ్యాలకు గురికాకుండా కేవలం మిషన్ భగీరథ నీటినే తాగడానికి ఉపయోగించాలని సూచించారు. నీటి వనరులను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు. ల్యాబ్ మైక్రోబయాలజిస్ట్ సిరంగి సంతోష్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. అత్యాధునిక ప్రయోగశాలల్లో నీటిని నిరంతరం పరీక్షిస్తున్నామని, మైక్రోబయలాజికల్ ప్రమాణాల ప్రకారం ఈ నీరు పూర్తిగా సురక్షితమని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహం లేకుండా ఈ నీటిని వినియోగించవచ్చని భరోసా ఇచ్చారు. ఏఈఈ మనోహర్ గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసడి తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల(సిరిన్యూస్):**



వరి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావులతో కలిసి వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్ణీత మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. గ్రేడ్–ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి గోనె సంచులు భద్రపర్చడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, మూత్రశాలలు, విద్యుత్, టేబుల్, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రతి కేంద్రంలో రెండు ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, 30 టార్పాలిన్లు, ఒక ప్యాడి క్లీనర్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉంటే ముందుగా ఆరబెట్టి తేమ తగ్గిన తర్వాతనే తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చినప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ ప్రతులు సమర్పించాలని, వ్యవసాయ విస్తరణ అధికారి జారీ చేసిన టోకెన్ ఆధారంగా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు రైతు ధృవీకరణ పత్రం సమర్పించాలన్నారు. సన్న రకం ధాన్యం సంచులపై ఎరుపు రంగుతో 'ఎస్' అక్షరం, సెంటర్ కోడ్ రాయాలని, దొడ్డు రకం ధాన్యం సంచులను ఆకుపచ్చ రంగు దారంతో కుట్టాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరు లారీల్లో తరలించాలని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుకు తూకం వివరాలతో కొనుగోలు పత్రం ఇవ్వాలని, జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, జిల్లా రవాణా అధికారి సంతోష్, కార్మిక శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల(సిరిన్యూస్):**



ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అనంతరం పోచంపహాడ్ గ్రామ పరిధిలో మండల తహశీల్దార్ పుష్పలతతో కలిసి జాతీయ రహదారి–63 విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి గడువులోగా జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో వంద శాతం ప్రవేశాలు కల్పించాలి

**• రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్**

**ఆదిలాబాద్(సిరిన్యూస్):**

జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ వసతి గృహాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను వంద శాతం ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ సి.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన ఆయన పలు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ఇచ్చోడ, బజార్‌హత్నూర్ ప్రాంతాల్లోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు ఆదిలాబాద్‌లోని కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. భోజన సదుపాయాలు, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రతినెలా విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని, వివిధ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సమీక్ష, ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఏఎస్‌డబ్ల్యుఓలు నారాయణ రెడ్డి, నర్సింగ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంపై జోగు రామన్న వ్యాఖ్యలు అర్థరహితం


**ఆదిలాబాద్(సిరిన్యూస్):**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జోగు రామన్న చేసిన విమర్శలు కేవలం రాజకీయ ఉనికి కోసమేనని, అవి పూర్తిగా అర్థరహితమని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ సాయిచరణ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన జోగు రామన్నకు ఇప్పుడు మహిళా గౌరవం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో బతుకమ్మ చీరల పేరుతో నాసిరకం వస్త్రాలను పంపిణీ చేసి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాణ్యమైన 'చిలుక పచ్చ' రంగు చీరలను పంపిణీ చేస్తామని ప్రకటించగానే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల గూటికి సంక్షేమాన్ని చేర్చిందని తెలిపారు. జోగు రామన్న మంత్రిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ జిల్లాకు చేసిన ఒక్క అభివృద్ధి పనైనా చెప్పగలరా అని సవాల్ విసిరారు. కొరట–చనాక వంటి సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎంపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆన్‌లైన్ ఇసుక విధానంపై ట్రాక్టర్ యూనియన్ ఆందోళన

**ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి**



**ఆసిఫాబాద్(సిరిన్యూస్):**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్‌లైన్ ఇసుక తవ్వకం, రవాణా విధానంపై ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇంతకుముందు రూ.1400 డీడీ తీసుకుని ఇసుక రవాణా నిర్వహించుకునే విధానం అమల్లో ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే ఇసుక తవ్వకం, రవాణా చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు కారణంగా ఆన్‌లైన్ విధానం సరిగా పనిచేయడం లేదని చెప్పారు. దీంతో ఇసుక రవాణా సక్రమంగా సాగక తమ ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పాత డీడీ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కొత్త విధానం ద్వారా ఎదురవుతున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఇసుక రవాణాను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పందిస్తూ ట్రాక్టర్ యూనియన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజల దాహార్తి తీర్చిన సర్పంచ్




**తిర్యాణి(సిరిన్యూస్):**

మండలంలోని ఏదులపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించినప్పటికీ, నీరు వినియోగించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు మాత్రం ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు తెలిపారు. బోర్ మాత్రమే ఉండి మోటార్ తదితర ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలను గమనించిన గ్రామ సర్పంచ్ మడావి అమృత అంబారావు బోర్‌కు మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచంచారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సిఏ పోస్టును వెంటనే భర్తీ చేయాలి

**గంభీరావుపేట(సిరిన్యూస్):**

నర్మాల గ్రామానికి సంబంధించిన కమ్యూనిటీ అసోసియేట్ (సిఏ) పోస్టును వెంటనే భర్తీ చేయాలని బీజేపీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నర్మాల గ్రామానికి చెందిన మహిళా గ్రూప్ సిఏ ప్రత్యేక పరిస్థితుల్లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ఆ పోస్టును భర్తీ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇటీవల నియామక ప్రక్రియకు తేదీలు ప్రకటించి అనంతరం రద్దు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పరీక్ష నిర్వహించినప్పటికీ నియామక ప్రక్రియను చేపట్టకపోవడం వెనుక ఏవైనా ఒత్తిడులు ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లోనై అధికారులు నియామకాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన అభ్యర్థులను వెంటనే ఎంపిక చేసి సిఏ పోస్టును భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఎంఎస్ ఏపీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు నర్సింలు, స్వామి, దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.





# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ


'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామి సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# అవును పెళ్లయ్యింది.. నలుగురు పిల్లలు

## విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.






# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.